# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-03-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న మహతారి వందన్ యోజన కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు వర్చువల్‌గా ప్రారంభిస్తారు.**

2. **రాష్ట్రంలో ఉన్న మహిళలకు వైయస్సార్ చేయూత పథకం ద్వారా తమ ప్రభుత్వం జీవనోపాధి మార్గాలను అందిస్తున్నామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు.**

3. **సంక్షేమం, అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఉపముఖ్యమంత్రి కె.నారాయణస్వామి తెలిపారు.**

4. **విశాఖపట్నం-పూరీ, విశాఖపట్నం-సికింద్రాబాద్‌ల మధ్య మరో రెండు వందేభారత్ రైళ్లు ఈనెల 12వ తేదీన ప్రారంభంకానున్నాయి.**

5. **హైకోర్టు ఉత్తర్వుల మేరకు డీఎస్సీ 2024 పరీక్షల షెడ్యూలులో రాష్ట్రప్రభుత్వం మార్పులు చేసింది.**

==========================

ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న మహతారి వందన్ యోజన కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు వర్చువల్‌గా ప్రారంభిస్తారు. ఈ పథకం కింద రాష్ట్రంలోని అర్హులైన 70 లక్షల మంది మహిళలకు ప్రతీనెలా వెయ్యిరూపాయల నగదు నేరుగా వారి ఖాతాల్లోకి బదిలీ చేస్తారు. పథకం ప్రారంభం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ కొంతమంది లబ్ధిదారులతో ముచ్చటించారు. ఈరోజు 655 కోట్ల రూపాయలు ప్రత్యక్ష నగదును లబ్ధిదారుల ఖాతాల్లో జమచేస్తారు.

--------------------------

రాష్ట్రంలో మహిళలకు వైయస్సార్ చేయూత పథకం ద్వారా 75 వేల రూపాయల ఆర్ధిక సాయం అందించడంతో పాటు వారికి జీవనోపాధి మార్గాలను అందిస్తూ భరోసా కల్పించామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో నిన్న ఆయన మాట్లాడుతూ... 45 నుండి 60 ఏళ్ల మధ్య వయస్సు గల ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు ప్రతి ఏటా “వైఎస్సార్ చేయూత” కింద 18 వేల 750 రూపాయల చొప్పున సాయం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 లక్షల 98 వేల 931 మంది మహిళలకు 4వ విడత “వైఎస్సార్ చేయూత”ను రాష్ట్ర ప్రభుత్వం అందించిందని మంత్రి పేర్కొన్నారు.

--------------------------

చిత్తూరు జిల్లా పెనుమూరులో కొత్తగా ఏర్పాటు చేసిన చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్‌ను ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి, అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈరోజు ప్రారంభించారు.

వెదురుకుప్పం మండలం చవటగుంటలో కొత్తగా ఏర్పాటు చేసిన చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఏటీఎంను కూడా వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ... రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

---------------------------

ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి, రాబోయే త్వరలో జరగనున్న ఎన్నికలకు సన్నాహకంగా నిర్వహిస్తున్న సిద్ధం బహిరంగ సభల్లో ఆఖరిది ఈ సాయంత్రం జరగనుంది. బాపట్ల జిల్లా మేదరమెట్ల సమీపంలో నిర్వహించే సభకు వైఎస్సార్సీపీ వర్గాలు భారీ ఏర్పాట్లు చేశాయి. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లోని 44 నియోజకవర్గాల నుంచి పార్టీ కార్యకర్తలు, ప్రజలు పెద్దసంఖ్యలో హాజరవుతున్నారు. ముఖ్యమంత్రి జగన్ ఇప్పటివరకూ భీమిలి, దెందులూరు, రాప్తాడులలో మూడు సిద్ధం సభలు నిర్వహించారు. ఈరోజుతో ఎన్నికల సన్నాహక సభలు ముగించి, ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన అనంతరం ప్రచార కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించడానికి అధికార పార్టీ ప్రణాళికలు రచిస్తోంది.

---------------------------

పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన అత్యంత వేగవంతమైన మల్టీ ప్రొటోకాల్ లేబుల్ స్విచింగ్ రౌటర్‌ను కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి అశ్వనీ వైష్ణవ్ నిన్న బెంగళూరులో ప్రారంభించారు. హై స్పీడ్ డేటా ప్రోసెసింగ్ అండ్ ట్రాన్స్ మిషన్ కోసం ఈ రౌటర్‌ను వినియోగిస్తారు. సెకనుకు 2.4 టెరాబిట్ల వేగం కలిగిన రౌటర్‌ను పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించడం గర్వకారణమని మంత్రి అన్నారు. డిజిటల్ భారతదేశాన్ని ఆవిష్కరించే క్రమంలో ఈ రౌటర్ నిర్మాణం మేలు మలుపని వ్యాఖ్యానించారు. భారీ డిజైన్ సామర్థ్యాలతో సాఫ్ట్ వేర్, హార్డ్ వేర్ రంగాల్లో భారత్ వేగంగా ముందుకు వెళుతుందని అన్నారు.

---------------------------

విశాఖపట్నం–పూరీ, విశాఖపట్నం–సికింద్రాబాద్‌ల మధ్య మరో రెండు వందేభారత్ రైళ్లను ఈనెల 12వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ దృశ్యమాధ్యమం ద్వారా ప్రారంభించనున్నారు. వీటితో పాటు కొత్తవలస–కోరాపుట్ సెక్షన్లు, కోరాపుట్–రాయగడ లైన్లలో రెండు డబ్లింగ్ ప్రాజెక్టులు, విజయనగరం–టిట్లాగఢ్ థర్డ్ లైన్ ప్రాజెక్ట్‌లో పూర్తి చేసిన భాగాలను, గూడ్స్ షెడ్, వాల్తేర్ డివిజన్‌లో ఒక స్టేషన్ వన్ ప్రొడక్ట్ స్టాల్స్‌ను కూడా ప్రధానమంత్రి ప్రారంభిస్తారు.

పూరీ–విశాఖపట్నం మధ్య వందేభారత్ రైలు శనివారం మినహా మిగిలిన అన్నిరోజుల్లో నడపనున్నట్లు అధికారులు తెలిపారు. పూరిలో ఉదయం 5 గంటల 15 నిమిషాలకు బయలుదేరి, అదే రోజు 11 గంటల 30 నిమిషాలకు విశాఖపట్నం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో విశాఖపట్నం నుండి మధ్యాహ్నం 3 గంటల 40 నిమిషాలకు బయలుదేరి, అదే రోజు పూరీకి రాత్రి 9 గంటల 55 నిమిషాలకు చేరుకుంటుంది. సికింద్రాబాద్–విశాఖపట్నం మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్ గురువారం మినహా అన్నిరోజులూ నడుపుతారు. సికింద్రాబాద్ నుంచి ఉదయం 5 గంటల 5 నిమిషాలకు బయలుదేరి, అదే రోజు మధ్యాహ్నం 1 గంటా 50 నిమిషాలకు విశాఖపట్నం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో విశాఖపట్నం నుండి మధ్యాహ్నం 2 గంటల 35 నిమిషాలకు బయలుదేరి, అదే రోజు రాత్రి 11 గంటల20 నిమిషాలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

---------------------------

హైకోర్టు ఉత్తర్వుల మేరకు డీఎస్సీ 2024 పరీక్షల షెడ్యూలులో రాష్ట్రప్రభుత్వం మార్పులు చేసింది. మార్చి 30 నుంచి ఏప్రిల్ 30 వరకూ ఈ పరీక్షలు నిర్వహించేలా మార్పులు చేసినట్లు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్ సురేష్ కుమార్ వెల్లడించారు. మార్చి 30 నుంచి ఏప్రిల్ 3 వరకూ సెకెండరీ గ్రేడ్ టీచర్ పరీక్ష

నిర్వహిస్తారు. ఏప్రిల్ 7న ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ టెస్ట్ నిర్వహిస్తారు. ఏప్రిల్ 13 నుంచి 30 వరకూ స్కూల్ అసిస్టెంట్, టీజీటీ, పీజీటీ, ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ పరీక్షలు నిర్వహిస్తారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలను ఎంచుకోడానికి వెబ్ ఆప్షన్లను మార్చి 20 నుంచి ఇస్తారు. హాల్ టికెట్లను మార్చి 25 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

----------------------------

రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, రాబోయే ఎన్నికల కోసం సన్నాహకంగా పార్టీ ప్రచార రథాలను ఈ ఉదయం విజయవాడలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మేనిఫెస్టో రూపకల్పన కోసం అభిప్రాయ సేకరణ చేపట్టనున్నామని వెల్లడించారు. తొమ్మిది జిల్లాలకు 18 మేనిఫెస్టో రథాలను పంపనున్నట్టు ఆమె పేర్కొన్నారు. టీడీపీ – జనసేన పార్టీలతో పొత్తు ఖరారవడం సంతోషమని వ్యాఖ్యానించారు. సీట్ల సర్దుబాటుపై రెండు రోజుల్లో స్పష్టత వస్తుందని ఆమె పేర్కొంటూ.....

వాయిస్ – 19 సెకన్లు

----------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రజలు వచ్చే ఎన్నికలలో మార్పు కోరుకుంటున్నారని రాజ్యసభ సభ్యులు సీఎం రమేష్ నాయుడు అన్నారు. కడపలో ఈరోజు పాత్రికేయులతో మాట్లాడిన సీఎం రమేష్.. భారతీయ జనతా పార్టీ భాగస్వామ్యం ఉన్న ప్రభుత్వమే రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందన్నారు. రాబోయే ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేసారు. జనసేన టిడిపి బిజెపి పొత్తుపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

----------------------------

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో రాయలసీమలో తాగు–సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం వేగవంతంగా జరుగుతోందని రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి అన్నారు. చిత్తూరుజిల్లా పుంగనూరులో ఈరోజు పాత్రికేయులతో మాట్లాడిన మిథున్‌రెడ్డి... కుప్పంలో హంద్రీ–నీవా ప్రాజెక్టును ముఖ్యమంత్రి ప్రారంభించాక తాగు, సాగునీటి సమస్యలు తీరాయన్నారు. పెండింగ్ ప్రాజెక్టుల పనులు వేగవంతంగా జరుగుతున్నాయని అన్నారు.

----------------------------

పారిస్‌లో జరుగుతున్న ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో పురుషుల డబుల్స్ కేటగిరీలో భారతదేశానికి చెందిన సాత్విక్ సాయిరాజ్ – చిరాగ్‌శెట్టి జంట ఫైనల్స్‌కి చేరుకుంది. గతరాత్రి జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో కొరియా జంటను ఓడించారు. రెండు వరుస సెట్లలో 21–13, 21–16 స్కోరుతో ఆధిక్యం సాధించారు. ఈరోజు జరిగే ఫైనల్స్ లో తైవాన్ క్రీడాకారులు యాంగ్‌పో–హాన్, లీ–జే–హూ జంటతో పోటీ పడతారు.

----------------------------

తిరుపతిలో సావిత్రిబాయి పూలే 127వ వర్ధంతిని ఈరోజు నిర్వహించారు. శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం ముందు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలి తరం మహిళా ఉద్యమ కారిణి, గొప్ప కవి, రచయిత్రి అన్నారు. సావిత్రి అడుగుజాడల్లో నేటి మహిళలు నడవాలని పిలుపునిచ్చారు.

----------------------------

సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో పాత్రికేయులు కీలక పాత్ర పోషించాలని ఏలూరు జిల్లా నోడల్ అధికారి తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ కోరారు. స్థానిక ఎంపిడిఓ ఎన్నికల నిర్వహణలో మీడియా పాత్ర అనే అంశంపై నిన్న ఏలూరులో పాత్రికేయులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పెయిడ్ న్యూస్, ఫేక్ న్యూస్‌లను నియంత్రించాల్సిన బాధ్యత మీడియాపై ఉందని సూచించారు.

========================